## గణనాథుని సేవలో మధ్యరైల్వే ఐజీ



కాణిపాకం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:
దక్షిణ మధ్య రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాకూర్ మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీవీరాంజ నేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.ఆమెకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట గుంతకల్ రైల్వే డీఎస్సీ మురళీకృష్ణ, ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడు, కాణిపాకం ఎస్సై ధరణీదర తదితరులు పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

### -పిఏసి 5 పనుల పరిశీలనలో అదనపు ఈఓ వెంకయ్యచౌదరి

తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న సామాన్యభక్తులకు వసతి సౌకర్యంలో ఇబ్బందులు కలగకుండా చూడాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. యాత్రికుల వసతి సముదాయం -5ని అధూనాతనంగా సౌకర్యాలు ఉండాలన్నారు. ఈ పనులను ఆయన మంగళవారం సాయంత్రం డిప్యూటీ ఈఓలు పి.హరీంద్రనాథ్, రాజేంద్ర, వెంకటయ్య, ఇఇలు వేణుగోపాల్, సుధాకర్, డిఇ చంద్రశేఖర్,విఎస్ఓ సురేంద్రతో కలసి తనిఖీ చేశారు.

# సామాన్యుడు మోయలేని 'భారం'!

## అమాంతం పెరిగిన వంటగ్యాస్, పెట్రోల్ ధరలు



ప్రభాతవార్త-తిరుపతి:
ఇప్పటికే తడిసిమోపెడైన వంటగ్యాస్, పెట్రోల్ ధరలు తాజాగా పెరిగిన భారంతో సామాన్యుడు విలవిల్లాడిపోతున్నాడు. నిన్నటివరకు 850 రూపాయలున్న వంటగ్యాస్ సిలిండర్ ధరకు అదనంగా 50 రూపాయలు నుండి 100 రూపాయల వరకు గ్యాస్‌డెలివరీ బాయ్స్ ప్రజల నుండి వసూలుచేయడం జరిగింది. ఇప్పుడు వంటగ్యాస్‌సిలిండర్‌పై ఒక్కసారిగా 50 రూపాయలు పెంచేయడంతో ఈ ధర 1000 రూపాయలకు చేరింది. అధికారికంగా గ్యాస్‌ఏజెన్సీల యాజమాన్యం 890 రూపాయలు (పెరిగిన ధర)కు సిలిండర్ విక్రయించినా అవి కాస్త ఇంటికి చేరేలోపు డెలివరీ బాయ్ 950 రూపాయల నుండి వెయ్యిరూపాయలవరకు వసూలుచేయడం తెలిసిన సత్యం. తెల్లరేషన్‌కార్డు కలిగిన లబ్ధిదారులైన వినియోగదారులకు500 రూపాయలకే వంటగ్యాస్ సిలిండర్ ఇదీ కొంతమందికిమాత్రమే అమలవుతోంది. మిగిలిన వాళ్ళు ఎప్పటిలాగే భారం మోయకతప్పడంలేదు. మరీ కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు పెంచిన ధరలతో పేద,మధ్యతరగతి వర్గాల ప్రజలు వెయ్యిరూపాయలు సిలిండర్ ధర చెల్లించడం తప్పదు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 90శాతంమంది ప్రజలు ఇళ్లలో వంటగ్యాస్ సిలిండర్‌ను వినియోగిస్తున్నారు. ఈ ధరలు కూటమి ప్రభుత్వంలో తగ్గుతాయని ఊహించిన ప్రజలకు దిమ్మతిరిగేలా చేసింది. అత్యవసరమైన వినియోగదారులకు 1,100 రూపాయలకు గ్యాస్ సిలిండర్ చెల్లించుకోవాల్సివదేనని వాపోతున్నారు. తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి, నగరి, పుత్తూరు, సత్యవేడు, చంద్రగిరి, పాకాల, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లోనూ వంటగ్యాస్ ధరలు 950 రూపాయలుగా అందిస్తుండటం కొసమెరుపు. ఇకనుండి వెయ్యిరూపాయలు బాదుడు తప్పదన్నట్లు మారింది. పెరిగిన ధరలు సామాన్యప్రజలకు మరింత భారంగానే ఉంది. సామాన్యప్రజలు వినియోగించే వంటగ్యాస్‌ను తక్కువ ధరకు అందిస్తామని ఎన్నికల్లో హామీఇచ్చిన పార్టీలు ఇప్పుడు ధరలు పెంచడం ఏంటనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పటికే నిత్యావసరవస్తువుల ధరలతో సతమతమవుతున్న సామాన్యులు ఈ ధరలతో మరింతగా భారంగామారింది.




**పెట్రోల్, డీజిల్ బాదుడే!:**
సామాన్యుడి నుండి ధనవంతుల వరకు నిత్యావసరాల్లో వాహనాలు వినియోగం పెరిగింది. పేద,కూలీపనులు చేసుకుంటున్న కార్మికులు కూడా ద్విచక్రవాహనం వాడుతున్నారు. తిరుపతి,చిత్తూరు వంటి నగరాల్లో నిన్నటివరకు 109.83రూపాయలు ఉన్న పెట్రోల్ లీటర్ ధర ఇక 2రూపాయలు పెరగడంతో 110రూపాయలపైగానే చేరింది. డీజిల్ ధర 99రూపాయలకు దాదాపుగా చేరింది. ఈ భారంతో వాహనాలు వినియోగించాలన్నా భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. తమిళనాడురాష్ట్రంలో ఉన్న పెట్రోల్, డీజల్ ధరలు సరిహద్దుజిల్లాలో మరీ అదనంగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు మరీ ఏకంగా పెరిగిన ధరలతో అన్ని వస్తువులపై ఈ ప్రభావం చూపుతుందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. మరీ ఈ ధరల పెరుగుదల భారం బస్సుఛార్జీలపై కూడా చూపితే పేదల పరిస్థితి పెనంనుండి పొయ్యిలో పడ్డట్లేనేది జనంలో చర్చ.

# పేదలకు అండగా ప్రభుత్వం

### రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్




అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సత్య ప్రసాద్

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :
కూటమి ప్రభుత్వం పేదలకు అండగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కట్టుపడి ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, పలువురు ఎమ్మెల్యేలు చంద్రగిరి పులివర్తి నాని, సూళ్ళురుపేట నెలవల విజయశ్రీ, శ్రీకాళహస్తి బొజ్జల సుధీర్‌రెడ్డి, తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పలు వాటిపై అధికారులకు ఆదేశాలు ఇచ్చి అక్కడికక్కడే పరిష్కరించి మిగిలినవి గడువు లోపు తప్పక పరిష్కరించాలని ఆదేశించారు అమరావతే కాకుండా రాయలసీమ తిరుపతి, విశాఖపట్నం వంటి పలు ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు వచ్చి అభివృద్ధి వైపు అడుగుల వేసేలా విజన్ 2047 అనే డాక్యుమెంట్‌ను రూపకల్పన చేశారని అన్నారు. ప్రజా ప్రతినిధులు జిల్లా యంత్రాంగం అందరూ కలిసి సమిష్టిగా సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టండి

### కమిషనర్ ఎన్.మౌర్య



తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త
నగరంలో ప్రజలకు వేసవి కాలంలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 17 వార్డు లో గల దాసరి మఠం, పలణి థియేటర్ సందు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పలు చోట్ల బోర్లు మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారని అన్నారు. వినియోగంలో లేని బోర్లలోని నీరు త్రాగడం వలన వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. వినియోగిస్తున్న వాటిని మరమ్మతులు చేయించాలని అన్నారు. అలాగే ప్రజలకు సురక్షితమైన నీరు అందించేలా అధికారులు చూడాలని అన్నారు. ఎండాకాలంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని అన్నారు. పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వీధికి, ఇంటికి చెత్త బండి వెళ్ళి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని అన్నారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ మహేష్, ఏసిపి బాలాజీ, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఫైర్ ఆఫీసర్ శ్రీనాథ్ రెడ్డి, సర్వేయర్ కోటేశ్వర రావు, తదితరులు ఉన్నారు.

## నేడు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం

వెంకటగిరి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త
ఈనెల తొమ్మిదో తేదీ వెంకటగిరి మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియ పై అవిశ్వాస తీర్మానం పెట్టనున్నారు. అవిశ్వాస తీర్మానానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. కౌన్సిలర్లకు విప్‌ను జారీ చేశారు. 19 మంది కౌన్సిలర్లకు పూజారి లక్ష్మి విప్‌ను జారీ చేశారు. ప్రతి ఒక్కరూ పార్టీకి కట్టుబడి ఉండాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి కౌన్సిలర్ సూచించారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన కౌన్సిలర్లకు తెలిపారు. పార్టీ విప్‌ను ధిక్కరిస్తే చర్యలుంటాయని తెలిపారు. మున్సిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు వైసిపి వారే ఉండగా 6 మంది చైర్పర్సన్‌ను వ్యతిరేకిస్తున్నారు. మొదట 16 మంది కౌన్సిలర్లు చైర్పర్సన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మరల కొంతమంది అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలపలేదు. అవిశ్వాస తీర్మానంపై ఉత్కంఠ భరితంగా నెలకొంది.



చైర్ పర్సన్ నక్క భానుప్రియ

**ఏర్పాటులను పరిశీలిం సబ్ కలెక్టర్, డి.ఎస్.పి**
మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియపై అవిశ్వాస తీర్మానం జరుగుతున్న సందర్భంగా తగు ఏర్పాటు చేస్తున్నట్లు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన తెలిపారు. డిఎస్పి గీత, సబ్ కలెక్టర్ మున్సిపాలిటీలో ఏర్పాటులను పరిశీలించారు. ఉదయం 10:30 గంటలకు కౌన్సిల్ హాల్ లో కౌన్సిలర్ల తో సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు ఎక్స్ అఫీషియ సభ్యులైన ఎమ్మెల్యేలను మాత్రమే సమావేశం మందిరంలోకి అనుమతిస్తామని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిదీ సీసీ కెమెరాలు ద్వారా పర్యవేక్షణ జరుగుతుం దని చెప్పారు. డిఎస్పి గీత మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్పిఎఫ్ బాలగాలను కూడా రప్పిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, సిఐ ఏవి రమణ, ఎస్ఐ సుబ్బారావు పాల్గొన్నారు.



ఏర్పాటను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

## తుపాకీ పేలి వ్యక్తి మృతి .. నిందితుడు అరెస్ట్

బాలాయపల్లి ఏప్రిల్ 8 (ప్రభాతవార్త)




మండలంలోని కోటంబేడుకి చెందిన తాడి వెంకట రమణయ్య మృతికి కారకుడైన శివయ్యను అరెస్ట్ చేసి నట్లు సిఐ ఏవి రమణ తెలిపారు. సిఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశ నిర్వహించారు. ఓజిలి మండలం రాగిపాడు గ్రామా నికి చెందిన శివయ్య మృతుడు వెంకట రమణయ్యలో అడవి పందులను నాటు తుపాకితో వేటాడే వారిని సిఐ తెలిపారు. గత నెల 3న శివయ్య, వెంకటరమణయ్యలు మద్యం సేవించి అడవి పందులను వేటాడేందుకు నాటు తుపాకితో బైకుపై వెళుతుండగా ప్రమాదవశాత్తు తుపాకీ పేలి వెంకటరమణయ్య మృతి చెందాడు. మృతి చెందిన వెంకటరమణయ్యను శివయ్య తెలుగుగంగ కాలువలో పడవేశాడు. అంతటితో ఆగకుండా శవాన్ని బయటికి తీసి వేరేచోట పడవేశారు. వెంకటరమణయ్య శవాన్ని పోస్టుమార్టం చేయగా తుపాకీ పేలి చనిపోయినట్లు నివేదిక రావడంతో దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ముద్దాయి కొండా శివయ్యను పట్టుకొని నాటు తుపాకి, నల్ల మందు ను ఎస్సై కామినేని గోపి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడుని రిమాండ్‌కు పంపుతున్నట్లు వివరించారు.

## మహేశ్వరయ్య ఇంట్లో ఏసీబీ సోదాలు

*తిరుపతి రూరల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త*
*ఇటీవల చంద్రగిరి సెక్రటరీగా విధులు నిర్వహిస్తూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన మహేశ్వరయ్య ఇంట్లో ఏసీబీ డీఎస్పీ విమల కుమారి ఆధ్వర్యంలో ఏసీబీ సోదాలు జరుగుతున్నాయి.మంగళవారం తిరుపతి రూరల్ పేరూరు ఏకదంతం అపార్ట్‌మెంట్‌లో తన స్వస్థలమైన పలమనేరు, బంధువులు ఇళ్ళల్లో బద్వేలు, తదితర ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పేరూరులో జరిగిన సోదాల్లో విశ్వేశ్వరయ్య ఇంట్లో ఒక కిలో బంగారం, వెండి, పెద్ద మొత్తంలో నగదు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. అలాగే బెంగుళూరు, ఇతర ప్రాంతాల్లో విశ్వేశ్వరయ్యకు ఆస్తులు ఉన్నట్లు గుర్తించి గుర్తించారు.*

## పేదల బియ్యం పరుల పాలు

### పోలీసుల చొరవతో స్వాధీనం
### 10టన్నుల బియ్యం స్వాధీనం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 8 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నుంచి విచ్చల విడిగా అక్రమం తమిళనాడుకు తరలిస్తున్న నిరుపేదల బియ్యాన్ని పోలీసులు నిఘా ఎపెట్టి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వెంకటరవి తెలిపారు. మంగళవారం ఆయన అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి,సత్యవేడుల నుంచి భారీ ఎత్తున రేషన్ బియ్యం అక్రమ రవాణ జరుగుతున్నట్లు కొంతకాలంగా సమాచారం అందన్నారు. కానీ పలుమార్లు దాడులు జరుపుతున్నా అక్రమ రవాణాదారులు జాగ్రత్తపడ్డారన్నారు. తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్పి కరీముల్లాషరీఫ్ ఆదేశాల మేరకు సిఐ వెంకటరవి, ఎస్ఐ రామకృష్ణనాయక్, సిఎస్‌డిటి రవిచంద్రబాబు హెడ్‌కానిస్టేబుల్ వెంకటాద్రి,కానిస్టేబుల్ అయ్యప్పలు కాపు కాచి సుమారు 10 టన్నుల బియ్యాన్ని రూ.3,51లక్షల విలువ చేసే బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం



ఏర్పేడు మండలం ముసలిపేడు మార్గంలో ప్రజా పంపిణి అక్రమంగా తరలిలపోతుందని ముందస్తు సమాచారం అందటంతో వెంబడించి శ్రీకాళహస్తి మండలం రామాపురం గ్రామం వద్ద వాహనాన్న స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వివరించారు.ఈ బియ్యాన్ని కెవిబిపురం మండలం కోవనూరు గ్రామానికి చెందిన కె.రాజేష్ (25) సూత్రధారి అని తెలిసిందన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని శ్రీకాళహస్తి ఎంఎల్ఎస్ కేంద్రానికి తరలించారు. నిందితునితో పాటు వాహనాన్ని శ్రీకాళహస్తి గ్రామీణ పోలీసులకు అప్పగించినట్లు సిఐ వెంకటరవి వివరించారు.

## పకడ్బందీగా విజన్ ప్రణాళికలు

### - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:
స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నియోజకవర్గాల వారీగా స్వల్ప, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలను పకడ్బందీగా సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం 2024 నుండి 2028-29 వరకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయడంపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్ జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా అటవీశాఖ అధికారి భరణిలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర- 2047విజన్ సాధనలో భాగంగా కార్యచరణను ప్రకటించడం జరిగిందని, ఈ క్రమంలో నియోజకవర్గ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలను ప్రత్యేక అధికారులు మే 31వ తేదీలోపు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ప్రణాళికలు తయారీలో ప్రత్యేక అధికారులు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన డాక్యుమెంట్‌ను తయారు చేసుకుని అందుకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకుని విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి సాంబశివారెడ్డి, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజకుమార్, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, డ్వామా పిడి రవికుమార్, హౌసింగ్ పిడి గోపాల్ నాయక్, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, జిల్లా వ్యవసాయ అదికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి ఆరీఫ్, పట్టుపరిశ్రమల శాఖ అదికారి శోభారాణి, డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, ఎపిఎంఐపి పిడి బాలసుబ్రమణ్యం, ఎల్‌డిఎం హరీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కుప్పంపై వైద్యశాఖ ఫోకస్

### - ఎన్‌సిడి అండ్ సర్వే నిర్వహణకు 268 మంది ఎఎన్‌ఎంలు కుప్పంకు డంప్
### - ప్రతిరోజు వెళ్ళి తిరిగిరావడానికి ఇబ్బందులు పడుతున్న ఎఎన్‌ఎంలు
### - రాత్రి 11 గంటలకైనా డ్యూటీ పూర్తి కాని పరిస్థితులు

చిత్తూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:
జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి నాన్ కమ్యునికల్ డీసీజెస్ అండ్ కమ్యునికల్ డిసిజెస్(ఎన్‌సిడి అండ్‌సిడి) సర్వే తలబొప్పి కడుతోంది. ఈ సర్వేలో భాగంగా వైద్య సిబ్బంది తమ పిహెచ్‌సి పరిధిలో వున్న ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పరీక్షలు నిర్వహించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సివుంటుంది. జిల్లా వ్యాప్తంగా ఈ సర్వే జరుగుతుండటంతో వైద్య సిబ్బంది తెల్లవారు జాము నుండి రాత్రి వరకు క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరికి పరీక్షలు చేసి వాటి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్ళి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఈ సర్వే ఇప్పటి వరకు సరాసరిన 60 నుండి 70 శాతం వరకు పూర్తయినట్లు వైద్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ పరిధిలో ఈ సర్వే శాతం తక్కువగా వుండటం జిల్లాలోని వైద్య ఆరోగ్య సిబ్బందికి షాక్ కొట్టింది. అక్కడి సిబ్బంది సర్వేను సక్రమంగా చేయకపోవడంతో జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పిలు, సూపర్‌వైజర్లు, ఎఎన్‌ఎంలను కుప్పం నియోజకవర్గంకు తీసుకెళ్ళి సర్వే పూర్తి చేయాలని జిల్లా అదధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా నుండి 268 మంది ఎఎన్‌ఎంలను కుప్పం నియోజకవర్గ పరిధిలో ఎన్‌సిడిఅండ్‌సిడి సర్వే నిర్వహించడానికి జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డంప్ చేసింది. కుప్పం నియోజకవర్గానికి సర్వే చేయడానికి వెళ్ళే ఎఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలను ప్రతి రోజు ఉదయం 6 గంటలకు చిత్తూరు, పూతలపట్టు, పలమేరు, పుంగనూరుల్లో నిర్ధేశించిన బస్‌స్టాపుల నుండి తీసుకెళ్తారు. అక్కడ సర్వే పూర్తయిన అనంతరం అదేరోజు రాత్రి మళ్ళీ ఎక్కడి నుండి తీసుకువచ్చారో అక్కడి వరకు తీసుకెళ్ళి బస్సుల్లో ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, సూపర్‌వైజర్లను వదలి పెడుతున్నారు. ఒక్క చిత్తూరు నుండి రెండు బస్సుల్లో ప్రస్తుతం ఎఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు కుప్పం నియోజకవర్గానికి బయలుదేరి వెళ్ళారు. చిత్తూరు నగరంలో అత్యధిక ఎఎన్‌ఎంలు నివాసం వుండని పరిస్థితి నెలకొనడం, వీరు ఇతర మండలాల నుండి చిత్తూరుకు ప్రతి రోజు వచ్చి విధులు నిర్వర్తించి తిరిగి వెళ్తుంటారు. ఇలాంటి వారు సైతం ఉదయం 6 గంటలకు చిత్తూరులో నిర్ధేశించిన బస్‌స్టాప్‌కు వచ్చి వుండాలని ఆదేశించడంతో వీరు ఇళ్ళ వద్ద ఉదయం 4 గంటల నుండి బయలుదేరాల్సిన పరిస్థితి. అలాగే సర్వే ముగిసిన అనంతరం కుప్పం నియోజకవర్గం నుండి బస్సుల్లో ఇక్కడి నుండి వెళ్ళిన వారు రాత్రి 7 గంటలకు బయలుదేరితే వారి గమ్యస్థానం చేరడానికి రాత్రి 11 గంటల సమయం పడుతుంది. అక్కడి నుండి మళ్ళీ స్వగ్రామంలోని ఇంటికి వెళ్ళడానికి ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుప్పం నియోజకవర్గంలో ఎన్‌సిడిఅండ్‌సిడి సర్వే శాతం తక్కువగా వుండటంతో దీని ప్రభావం రాష్ట్రంపై పడుతుందని భావించి ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కుప్పం నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో సర్వే నిర్వహించడానికి చిత్తూరు, పూతలపట్టు, పుంగనూరు, పలమనేరుల నుండి ప్రతి రోజు 5 బస్సుల్లో 268 మంది ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు వెళ్తున్నారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో వున్న ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు చిత్తూరు ఎంఎస్‌ఆర్ సర్కిల్ వద్దకు ఉదయం 6 గంటలకు బయలుదేరి వెళ్తే పూతలపట్టు నియోజక వర్గంకు సంబంధించి పాటూరు, బంగారుపాళ్యం, పూతలపట్టుల నుండి ఎఎన్‌ఎంలు వెళ్తున్నారు. అలాగే పుంగనూరు నుండి పుంగనూరు, కల్లూరు, సదుం, సోమల, చౌడేపల్లిల నుండి ఎన్‌ఎంలు వెళ్తుండగా పలమనేరు నుండి పద్మశ్రీ సర్కిల్, కొలమాసనపల్లి, బైరెడ్డిపల్లిల నుండి ఎఎన్‌ఎంలు ప్రతి రోజు బస్సుల్లో వెళ్ళి వస్తున్నారు. ఈ సర్వేను పక్కాగా నిర్వహించడానికి కలెక్టర్ ఒకొక్క బస్సుకు ఒక వెహికల్ ఇన్స్‌పెక్టర్‌ను పర్యవేక్షణలో వైద్యశాఖ వైద్యాధికారుల సమన్వయం వుండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే తమ పరిధిలో ఎన్‌సిడిఅండ్‌సిడి సర్వేను పూర్తి చేయని ఎఎన్‌ఎంలు ఇప్పుడు అదనంగా కుప్పం నియోజకవర్గంకు వెళ్ళి సర్వే చేసి తిరిగి రావాల్సివస్తుండటంతో ఈ సర్వే తమకు ఎంత కష్టం తెచ్చిపెట్టిందని వాపోతున్నారు. ఒ ఎన్‌సిడిఅండ్‌సిడి సర్వే కుప్పంలో మెరుగుపడకుంటే మరో ఒకటి రెండు రోజులు కుప్పంకు వెళ్ళి సర్వే పూర్తి రావాల్సిన పరిస్థితి జిల్లాలోని ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలకు వుంటుంది.

## రామకుప్పంలో శునకాల వీరంగం

రామకుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

స్థానిక బందార్లపల్లి క్రాస్ వద్ద శునకాల దెబ్బకు జనం హడలెత్తిపోతున్నారు. మంగళవారం ఓ శునకం ముగ్గుర్ని కరిచేసింది. దీంతో వారు ఆస్పత్రికి పరుగులు తీశారు. రామకుప్పంలో ఇటీవల శునకాల బెడద అధికంగా మారింది. పంచాయతీ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

## సింహవాహనంపై కాశీ విశ్వేశ్వరస్వామి ఊరేగింపు

రామకుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



స్థానిక శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని సింహవాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం,పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. టిటిడి ధర్మ ప్రచార పరిషత్ ద్వారా ఆధ్యాత్మిక సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

## తెలుగుదేశంతోనే గ్రామాలు అభివృద్ధి

- ఎంపీ దగ్గుమళ్ళ, ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్‌లు



**శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు సర్వతో ముఖాభివృద్ధి చెందుతున్నాయని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్‌లు పేర్కొన్నారు. ఎస్ఆర్ పురం మండల పరిధిలోని మంగుంటలో మంగళవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్‌లు పలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్‌లు రూ.28 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం ప్రహరిగోడ, గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా ఎస్ఆర్ పురం మండలంలో ఎంపీ నిధులతో ఎక్కువ పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం అధ్యక్షులు గంథమనేని జయశంకర్‌నాయుడు, జిల్లా నాయకులు గంథమనేని రాజశేఖర్‌నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్‌యాదవ్, పెనుమూరు మండల పార్టీ అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, నాయకులు జీవన్‌బాబు, చంద్రబాబురెడ్డి, సూర్‌రెడ్డి, మాజీ పార్టీ అధ్యక్షులు భాస్కర్‌నాయుడు, సిద్దయ్యశెట్టిలతో అన్ని శాఖల అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్తలకు ఎంపీ పరామర్శ

పెనుమూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:



వెన్నుముక సమస్యతో బాధపడుతున్న టిడిపి కార్యకర్త నాథమునిని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మంగళవారం పరామర్శించారు. నాదముని వెన్నుముక సమస్యతో బాధపడుతూ ఇటీవల వైద్యం తీసుకుని కోలుకున్నారు. విశ్రాంతిలో వున్న నాథమునిని పులికల్లు గ్రామ పంచాయతీ గొడుగుమానుపల్లి గ్రామంలోని ఆయన ఇంటికి ఎంపీ దగ్గుమళ్ళ వెళ్ళి పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తోందని ఎంపీ ఆయనకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, నాయకులు గంథమనేని రాజశేఖర్‌నాయుడు, శ్రీధర్‌యాదవ్, కోదండయాదవ్, సూరిరెడ్డి, ప్రసాద్‌యాదవ్, రమేష్, కోదండపాణి, దిలీప్‌కుమార్, పట్టాభి, రవి, గిరి, నరేష్, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆశాలకు యూనిఫాం పంపిణీ

గుడిపాల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:



గుడిపాల పిహెచ్‌సిలో ఆశా వర్కర్లు వైద్యాధికారి డాక్టర్ సంధ్య మంగళవారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లకు డాక్టర్ సంధ్య మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల నమోదు తప్పనిసరి అని, గర్భిణీలు, బాలింతలకు అందజేయాల్సిన సేవలను వివరించారు. ఆశాలు వారికి నిర్దేశించిన గ్రామాల్లో ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ బాల సూర్యనారాయణ, సూపర్‌వైజర్ విజయ, ఆశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా పోషన్ పక్వాడా



**గుడిపాల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** క్షేత్ర స్థాయిలో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పోషక్ పక్వాడా కార్యక్రమంను పక్కాగా అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్ తోయజాక్షి పేర్కొన్నారు. మండల పరిధిలోని తుమ్మలవారిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషక్ పక్వాడ కార్యక్రమంపై అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ప్రభుత్వం అందించే పోషకాహాలకు విధిగా అందించాలన్నారు. అలాగే పోషక ఆహారంపై గర్భిణీలకు అవగాహన కల్పించాలన్నారు.

## వేము కళాశాల విద్యార్థుల ప్రతిభ



**పూతలపట్టు, ఏప్రిల్ 8, ప్రభాత వార్త:** పూతలపట్టు మండలం పి కొత్త కోట సమీపంలో వున్న వేము ఇంజనీరింగ్ కళాశాల దిన దిన ప్రవర్ధ మానంగా, వెలుగొందుతూ విద్యార్థుల, ప్రతిభా పాటవాలకు నిలువుటద్దంలా నిలుస్తుంది. ఈ సంవత్సరం 41 మంది బి టెక్ విద్యార్థులు, 14 మంది డిప్లొమా విద్యార్థులు వార్షిక పరీక్షల్లో 90 కంటే అధికంగా మార్కులను సాధించారు. 80 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు కోకొల్లలు. ఇందులో బీ.టెక్ చదువుతున్న కె. లక్ష్మి ప్రియ 95శాతం మార్కులతో 10/10 సిపిపిఎ, బి. ప్రియ 94.2 శాతం, 89.92/10 సిజిపిఏ ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. అలాగే డిప్లొమా చదువుతున్న షేక్ జైబా ఫయాజ్ 96.5శాతం, టి. మానస 95 శాతం మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. నవీన్ కిలారీ వేము కళాశాలకు చెందిన విద్యార్థులు అందరూ కూడా, గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వారేనని, వారి యొక్క మేథా శక్తిని, పదును పెట్టే విధంగా, కళాశాల అధ్యాపకులు వారికి విషయ పరిజ్ఞానంతో పాటు, కమ్యూ నికేషన్ స్కిల్స్ మీద కూడా ప్రత్యేక శిక్షణను ఇస్తూ, వారి ఉత్తీర్ణత శాతాన్ని మరింతగా పెంచడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులను చదువులలో ప్రోత్సహించడానికి, కళాశాల యాజమాన్యం 90 శాతం కంటే అధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం మెరిట్ స్కాలర్షిప్‌లను అందిస్తోందని కాలేజీ యాజమాన్యం తెలియజేశారు.

## పాథమిక ఆరోగ్య కేంద్రం కమిటీ చైర్మన్‌గా ఆమూరి రాజేష్

**కల్లూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమిటీ చైర్మన్‌గా కల్లూరుకు చెందిన వ్యాపారవేత్త ఆమూరి రాజేష్‌ను నియమించారు. ఈ మేరకు డిఎంహెచ్వో ఉత్తర్వులు జారీ చేశారు. పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆమూరి రాజేష్‌కు నియమాక పత్రం అందజేశారు. ఆమూరి రాజేష్ మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన చల్లా రామచంద్ర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమూరి రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి అందరి సహకారంతో కృషిచేస్తూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ముందుంటానని అన్నారు.

## కుప్పానికి మహిళలు పారిశ్రామిక బ్రాండ్ ఇమేజ్ తేవాలి

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



కుప్పం ప్రాంతంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉన్నతస్థాయికి ఎదిగి కుప్పానికి పారిశ్రామికపరంగా బ్రాండ్ ఇమేజ్ తేవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ కోరారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో అలీప్‌సంస్థ, కడ అధ్వర్యంలో పారి శ్రామికశిక్షణ పొందిన యాభైమంది మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. తాపేశ్వరం కాజాకు, ఆత్రేయపురం పూతరేకులకు ఎంత ప్రసిద్ధో కుప్పం ప్రాంతం కూడా అంతే రీతిలో ఇక్కడి ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందాలని సూచించారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో ప్రతి ఇంటికి ఓ పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారన్నారు. అందుకు అనుగుణంగా తొలుత మహిళలను లక్షాధికారులు చేయాలని వారి కుటుంబాలు ఆర్థికంగా పైకి ఎదగాలనే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలీప్ సంస్థను కుప్పంకు రప్పించి మహిళల్ని ఉన్నతస్థాయి తీసుకెళ్లేందుకు సిఎం సతీమణి నారా భువనమ్మ కృషి చేస్తున్నారన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ కుప్పంలో మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ కడ, అలీప్ ద్వారా రెండో విడత మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. త్వరలోనే అలీప్ సంస్థ కార్యకలాపాలు ప్రారంభమవు తాయన్నారు. వారు ఏర్పాటుచేసే పారిశ్రామికవాడలో మహిళా పారిశ్రామికవేత్తలకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్‌మునిరత్నం, కడ పి.డి. వికాస్ మర్మత్, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, ఆనందరెడ్డి, కౌన్సిలర్ సోమశేఖర్, నేతలు కన్నన్, రవి, జనసేన నరేష్, బిజెపి శివశంకర్, తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ, కుప్పం మండల అధ్యక్షురాలు వసం తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రెస్కో విశ్రాంత ఉద్యోగి మృతి.. నేతల సంతాపం

కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) విశ్రాంత ఉద్యోగి శ్రీనివాసులు అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈయన గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేవారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ వైస్‌ఛైర్మన్‌పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ బిఆర్ సురేష్‌బాబు, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్,కౌన్సిలర్ సోమశేఖర్, నేతలు మంజు, సతీష్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించారు.

## నీటిసమస్య పరిష్కారంకు నూతన పైపులైను ఏర్పాటు

కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి 19వ వార్డులో వేసవి దృష్ట్యా మంచినీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము స్పందించారు. స్థానిక వడ్డి చెరువు కట్ట వద్దనుంచి మర్రిమానువీధి ఎక్స్‌టెన్షన్ ప్రాంతం వరకు నూతన పైపులైనును కొత్తగా ఏర్పాటుచేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## మహిళ మెడలోంచి తాళిబొట్టు..బంగారుచైను చోరీ

కుప్పంరూరల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మహిళ మెడలోంచి తాళిబొట్టు, బంగారుచైను లాక్కెళ్లిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని జంపనూరులో చోటు చేసుకుంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు వివరాలిలా.. జంపనూరుకు గ్రామంలో మురుగన్, అతని భార్య లక్ష్మి నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి వీరు ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి లక్ష్మి మెడలోని బంగారుచైను, తాళిబొట్టు లాక్కుని పారిపోయాడన్నారు. ఈ మేరకు బాధితురాలు కుప్పం పోలీసులను ఆశ్రయించింది.

## రోడ్డు విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వవిప్‌కు వినతి

కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

కుప్పం – మోట్లచేను ప్రధాన రహదారిలో కూసూరు గ్రామం వద్ద నూతనంగా మంజూరైన సిమెంట్ రోడ్డు ను అదనంగా మరో యాభై మీటర్ల విస్తీర్ణం పెంచాలని కోరుతూ ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు వనసంరక్షణ సమితి అధ్యక్షుడు కనకరాజు వినతి పత్రం అందించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి రోడ్డును యాభై మీటర్ల దూరం విస్తరించా లని ఆర్‌అండ్‌బి డిఇ దస్తగిరిని ఆదేశించారు. అనంతరం డిఇ గ్రామంలో రోడ్డు పనులను పరిశీలించారు. ప్రభుత్వ విప్‌కు కనకరాజు కృతజ్ఞతలు తెలిపారు.

## బంగారం దోపిడీ కేసులో మరో ఐదుమంది అరెస్ట్

వి.కోట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



మండలంలోని నాయకనేరి అటవీ ప్రాంతంలో వారం క్రితం జరిగిన దారి దోపిడీ ఘటన కేసులో మరో ఐదుమంది నిందితులను అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం కెజిఎఫ్‌కు చెందిన దీపక్ సూట్ చెన్నై నుంచి వి.కోట మీదుగా 3.5కిలోల బంగారు బిస్కెట్లను తరలిస్తుండగా దారి దోపిడీకి పాల్పడిన వారిలో నలుగురు నిందితులను ఇదివరకే అరెస్ట్ చేశామన్నారు. ప్రస్తుతం వేదాచలం (44), కుమరేష్ (39), రంజిత్ (35), దీపన్ చక్రవర్తి (42), సూరవేల్ (48)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం లో సిఐ సోమశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో భూసమస్యలను పరిష్కరించండి

.తొట్టంబేడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



మండలంలో భూసమస్యలను పరిష్కరించాలని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీ నాయుడు తహశీల్దార్ మధుసూధన్‌రావుకు సూచించారు. నియోజకవర్గ శాసనసభ్యుడు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు తొట్టంబేడు మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమస్యల పరిష్కావేదికలో మండల రెవెన్యూ అధికారి మధుసూధనరావు, మండల ఎంపిడిఓ సురేంద్రనాథ్‌లు పలు శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గాలిమురళీ నాయుడు మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్‌మాఫియా, ఇసుకమాఫియాలను అడ్డుకోవాలని గ్రామాల్లో మంచినీటి సమస్యలను తీర్చాలని అధికారులను కోరారు. అధికారులు స్పందిస్తూ సమస్యలపై త్వరగా స్పందిస్తామని హామీ ఇచ్చారు.

## గిరిజన పాఠశాలకు స్థలం కేటాయించాలి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త మండలంలో గిరిజన పాఠశాల కొరకు 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్ విజ్ఞప్తి మంగళవారం ఉదయం పుంగనూరు మండల ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ చైర్మన్ రామయ్య, కమిటీ సభ్యులు చిన్న రాయుడు, నాగరాజు, కృష్ణప్ప తదితరులు పుంగనూరు మండల తాసిల్దార్ రామును మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి దళిత గిరిజన సమస్యలను వివరించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావేదిక లక్ష్యం :

రాష్ట్ర విఫ్ డాక్టర్ వియం.థామస్

వెదురుకుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :



ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ప్రజావేదికను ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తుందని గంగాధర నెల్లూరు శాసనసభ సభ్యులు, రాష్ట్ర విఫ్ డాక్టర్ వియం.థామస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కరం కొరకు ప్రజలు కార్యాలయాల చుట్టు ప్రదక్షణలు చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు వచ్చి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరించడంకు చొరవ చూపడం చేస్తున్నామని గుర్తు చేశారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వారి సమస్యలతో కూడిన వినతి ప్రతాలు అందజేయడంతో ప్రతి వినతి పత్రం పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి, ఎంపిడివో పురుషోత్తం, తహశీల్ధార్ కె.బాబు, క్లష్టర్ ఇన్‌చార్జ్ మోహన్ మురళి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మునిచంద్రా రెడ్డి, నాయకులు బాబు నాయుడు, సుధాకర్, చంగల్రాయ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం పోస్టర్లు ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే

వెదురుకుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో ఐసిడిఎస్ సీడిపివో పద్మసునంద ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార పోస్టర్లు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ వియం.థామస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 0–59 నెలల వరకు చిన్నారులకు కోసం కమ్యూనిటి స్థాయిలో నిర్వహించే కార్యక్రమాలు వివరించారు. పిల్లలు, బాలింతలకు అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందజేస్తున్న సేవలను వారికి వివరించారు. శ్రీఎంపిడివోపురుషోత్తం,అంగన్‌వాడి కార్యకర్తలు, చిన్నారులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : ఎంపిడిఓ

పెద్దపంజాణి ఏప్రిల్ 8 ప్రభాతవార్త:



మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు పారిశుధ్యపనులపై ప్రత్యేకదృష్టి సారించినట్లు ఎంపిడిఓ బాలాజీ, ఈఓపీఆర్‌డి శారదదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండ లకేంద్రంలో పంచాయతీ సర్పంచ్ ఆఖిలాభి పంచాయతీ కార్యదర్శి లత ఆధ్వర్యంలో పారిశుధ్యపనులు చేపట్టగా పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరన్స్ పనులను చేపట్టాలని జిల్లాకలెక్టరు ఆదేశించి ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా చెత్తదిబ్బలు లేకుండా మురుగునీటి కాలువలను సైతం శుభ్రపరుస్తూ జెసిబిలు,ట్రాక్టర్లతో చెత్తాచెదారాలను గ్రామాల్లో తొలగిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రజల కూడా ఎక్కడపడితే అక్కడ చెత్తను పడవేయకుండా పారిశుధ్యానికి తమవంతు సహకరించాలని కోరారు.

## అనారోగ్యంతో ఆశా కార్యకర్త మృతి

చౌడేపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

అనారోగ్యంతో ఆశా కార్యకర్త మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని పెద్దకొండామర్రి సచివాలయం పెద్దయల్లకుంట్లకు చెందిన ఆశా కార్యకర్త జి.లక్ష్మీదేవి(40) గత కొన్నాళ్ళుగా గుండె, మూత్ర పిండాలకు సంబంధించిన వ్యాధితో బాధ పడుతుండేది. ఇటీవల వ్యాధి తీవ్రత అధికం కావడంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమె మృతికి వైద్యాధికారి పవన్‌కుమార్, ఆశా కార్యకర్తలు స్థానిక ఆసుపత్రిలో సంతాప సభ ఏర్పాటు చేసి సానుభూతిని వ్యక్తం చేసారు.

## గంగమ్మకు వెండి కిరీటం బహూకరణ

బోయకొండ(చౌడేపల్లి), ఏప్రిల్ 8 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు దాత వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈమేరకు ఆలయంలోని గర్భాలయంలో మంగళవారం ఆలయ ఇఓ, ఉప కమీషనర్ ఏకాంబరంకు దాత పెద్దపంజాని మండలం బట్టందొడ్డికి చెందిన మోహన్‌రెడ్డి దంపతులు అందిం చారు. దాతలకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. ఆలయ అర్చక, అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు అరగొండలో అపోలోచే ఉచిత వైద్యశిబిరం

తవణంపల్లె, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండలో అపోలో ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య చికిత్సా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి జనరల్ మేనేజర్ డాక్టర్ వినోద్, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. గర్భిణీ స్త్రీల కాన్పులు, స్త్రీలలో కిడ్నీలకు, మూత్రాశయమునకు సంబందించిన అన్ని రకాల వ్యాధులకు ఆస్పత్రికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులచే ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్యచికిత్సీ శిభిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అపాయింట్ మెంట్ సం 9100681066,9177911066నెంబర్లలోసంప్రదించాలని డాక్టర్ వినోద్, చంద్రశేఖ ర్‌రెడ్డిలు తెలిపారు.

## అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓచే ఐరాల పీహెచ్‌సీ తనిఖీ

ఐరాల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా అదనపు సీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌సెంటర్ పరిధిలో వ్యాధి నిరోధక టీకాలు, మాతా శిశుసంరక్షణ కార్యక్రమాలు, పలు రికార్డులను పరిశీలించారు. అలాగే పీహెచ్‌సీ పరిధిలో అంటురోగాలు ప్రబలకుండా సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీనితో పాటు పీహెచ్‌సీ పరిధిలో డెంగ్యూ, హెచ్ఐవి, లెప్రసీ కేసులను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. అలాగే డాక్టర్ వెంకట ప్రసాద్ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: ఎంపీడీఓ

రొంపిచెర్ల, ఏప్రిల్ 8, ప్రభాతవార్త



ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంగళవారం బొమ్మయ్య గారి పల్లి గ్రామ పంచాయతీలోని సర్వర్ పేట, ముత్యాలమ్మ గుడి వీధిలో మురికి నీటి కాలువలు శుభ్రపరచడాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు క్రమం తప్పకుండా మురికినీటి కాలువలను శుభ్రపరచాలని తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మురికినీటి కాలువలలో చెత్తాచెదారాన్ని వేయరాదని సూచించారు. ఇళ్లలోని చెత్తను తడి చెత్త, పొడి చెత్తల రూపంలో వేరువేరుగా ఉంచి పంచాయతీ చెత్త ట్రాక్టర్ వచ్చినప్పుడు వేయాలని కోరారు. మురికి నీటి కాలువలలో చెత్తాచెదారం వేయడం వలన కాలువలో నీరు పేరకపోయి దోమలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిబాబు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## ఆంగ్లభాషపై విద్యార్థినులకు శిక్షణ

**తిరుపతి విద్య ఏప్రిల్ 8 ప్రభాత వార్త**



ఏపీ సిల్క్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో పద్మావతి మహిళా వర్సిటీలో మంగళవారం విద్యార్థినులకు ఆంగ్లభాషపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు జ్యోతిర్మయి ఆంగ్లబాష పై పట్టు, నైతికవిలువలు, ఇంటర్వ్యూలు, డిబేట్, గ్రూప్ డిస్కషన్,పబ్లిక్ స్పీకింగ్,ఫర్సనాలిటీ డెవలప్మెంట్, జనరల్ కమ్యూనికేషన్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్ ప్రొఫెసర్ శోభారాణి మాట్లాడుతూ గత 30రోజుల పాటు జరిగిన శిక్షణా కార్యక్రమంలో విద్యార్థినులు ఇంగ్లీషు భాషలోని మెలుకువలపై పట్టు సాధించడం అభినందనీయమన్నారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ప్రతి ఏడాది క్రమం తప్పకుండా విద్యార్థులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి - ఏఐటీయూసీ

విజయపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:



ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ నాయకులు మంగళవారం మండల కేంద్రమైన విజయపురంలో వైద్యాధికారిణి విష్ణుప్రియకు వినతిపత్రం అందించారు. ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలకు గ్రాట్యువిటీ రూ.50 వేలు అందించాలని, పదవీ విరమణ వయసు 60 నుంచి 62కు పెంచాలని కోరారు. ఆశలకు మెటర్నటీ సెలవు 180 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, నాయకులు సలీనా, భువన, ముని, లక్ష్మి, లత, షీబా, ఝాన్సీ, రేవతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సదుం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :సదుం మండలం గొంగివారిపల్లె వద్ద గుర్తు తెలియని వ్యక్తి శవం బయటపడిన విషయం మంగళవారం సాయంత్రం జరిగింది. ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు గంగివారిపల్లె దగ్గర్లోని రెడ్డివారికుంటలో 40 సంవత్సరాల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో పశువుల కాపరులు కనుగొన్నారు. పశువులు మేపేందుకు వెళ్తున్న వారు శవాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతదే హంగా నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సదుం మండలం అంబేద్కర్ యువజన సంఘం ఎన్నిక

సదుం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:సదుం మండలం అంబేద్కర్ యువజన సంఘంను మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం సీతాపతి, ఉపాధ్యక్షులుగా కే. రాంబాబు, ఎస్ శ్రీనివాసులు, ఎం. నరసింహులు, కుమార్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎస్. రాజన్న, ఎం. మాధవయ్య ఉప కార్యదర్శిగా కె. మదన్మోహన్, కోశాధికారిగా ఎస్ జై చంద్ర, కమిటీ సభ్యులుగా మహేంద్ర, గంగాధర్, రాజేష్, నాగరాజా, సుబ్రహ్మణ్యం, హరినాథ్, వెంకటరామయ్య, అశోక్ కుమార్, చౌడప్ప, రమణయ్య, శ్రీనివాసులు, వెంకటరమణ, సుధాకర్‌లను ఎన్నుకున్నారు.

## బియ్యం వితరణ

***శ్రీకాళహస్తి రూరల్,ఏప్రిల్ 8 ప్రభాతవార్త*** శ్రీకాళహస్తి మండలం ఏర్పేడు గ్రామంలో వెలసిన పరశురామేశ్వరాలయానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారని ఇఓ రామచంద్రారెడ్డి మంగళవారం వివరించారు. ఆలయంలో కొంత కాలంగా నిత్య అన్నదానం ట్రస్టుకు మాస్టర్ హోమియోపతి హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.రవికిరణ్ ఆలయానికి ఎనిమిది బస్తాల బియ్యం, ఆరు టన్నుల ఆయిత్‌ను అందించారు. ఆలయంలో కొంత కాలంగా నిత్యాన్నదాన పథకాన్ని ఏర్పాటు చేసి అమలు చేస్తున్నారు. వారికి మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు ఆలయంలో వారికి ప్రత్యేక దర్శనం ఆశీర్వచనాలు అందించారు.

## పరశురామేశ్వరుని సేవలో సినీ దర్శకులు

శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



మహిమాన్వితం, చారిత్రక ప్రసిద్ధి చెందిన పురావస్తుశాఖ పర్యవేక్షణలో ఉన్న పరశురామేశ్వరాలయానికి అతిధుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపధ్యంలో మంగళవారం ప్రముఖ సినీ దర్శకులు మారుతీ వారి కుటుంబసభ్యులు రాగా వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మెన్ బత్తల గిరిబాబు దర్శనం ఏర్పాట్లు చేసారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం వారికి వేదపండితులు,అర్చకులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. తీర్థ ప్రసాదాలు అందించారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

.తొట్టంబేడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలపరిషత్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ పి.సురేంద్రనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపిపి ఉన్నం నిర్మల, జడ్పీటిసి అర్చనాదేవిలతో పాటు వివిధ శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరవ్వాలని ఎంపిడిఓ తెలిపారు. మొత్తం మండలంలో 21శాఖలు ఉన్నాయని అన్నిశాఖల అధికారులు తప్పక హాజరవ్వాలని కోరారు. ఉదయం 10గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

## మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు : డిఎస్‌పి



వెంకటగిరి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: ఈ నెల 9వ తేదీ చైర్పర్సన్‌పై మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానం ఉన్న సందర్భంగా భారి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గూడూర్ డిఎస్పి పి.గీత తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆమె ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక బలగాలను కూడా ఈ సందర్భంగా రప్పిస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలర్లు తప్ప ఇతరులను లోనికి అనుమతించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఏవి రమణ, ఎస్ఐ సుబ్బారావు సిబ్బంది ఉన్నారు.

## వేసవిలో ఊరెళుతున్నారా... దొంగలతో జాగ్రత్త : సిఐ



కోట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: వేసవిలో విద్యాసంస్థలకు సెలవులు ఇస్తుండటంతో పలువురు వారి వారి సొంతూళ్లకు, బంధుమిత్రుల ఇళ్లకు వెళుతుంటారని, ఊళ్లకు వెళ్లే సమయంలో ఇంటికి తాళం వేయాల్సివచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే దొంగల వారి నుంచి బయటపడవచ్చని వాకాడు సిఐ షేక్ హుస్సేన్‌బాషా చెప్పారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఊళ్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇస్తే వారి నివాస ప్రాంతాల్లో గస్తీ పెంచుతారని చెప్పారు. విలువైన బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులు ఇంట్లో ఉంచుకోకూడదన్నారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు ఇంటి పరిసర ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకొని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఇంట్లో లైట్లు వేసి ఉంచాలని, ప్రధాన ద్వారానికి వేసిన తాళం కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలని, ఇంటి వైపు చూస్తుండాలని ఇరుగు పొరుగు వారికి చెప్పాలన్నారు. కాలనీలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100కు తెలియజేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ఆరుబయట నిద్రించే వారు ఇళ్లకు తాళాలు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## కర్లపూడి వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

**- సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి**



కోట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : కోట మండలం కర్లపూడి గ్రామ ప్రజలు, రైతులు అవసరాల నిమిత్తం సాగరమాల రోడ్డు వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని సిద్ధవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు ఆయన మంగళవారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ సర్పంచ్ సన్నారెడ్డి రాజ్యలక్ష్మి, వార్డుసభ్యులు ఏకగ్రీవంగా సర్వీసు రోడ్డు కోసం తీర్మానం చేశారని తెలిపారు. సాగరమాల రోడ్డు (సిబిఐసి) నిర్మాణానికి అవసరమైన భూములను భూసేకరణ ద్వారా సర్వే చేసి భూములకు పరిహారం కూడా ఇచ్చారని తెలిపారు. అయితే తమ గ్రామంలోని సాగరమాల రోడ్డుకు దక్షిణం వైపు ఉన్న రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో వ్యవసాయం చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తిరుపతి ఎంపీ గురుమూర్తిని త్వరలోనే కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతామని చెప్పారు.

## అంగన్‌వాడి కేంద్రంలో విద్యార్థులకు అస్వస్థత

నాయుడుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : పెళ్ళకూరు మండలంలోని కానూరు దళితవాడలోని అంగన్‌వాడి కేంద్రంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన సోమవారం జరిగింది. సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కానూరు దళితవాడ అంగన్‌వాడి కేంద్రంలో 15మంది విద్యార్థులు చదువుతున్నారు. రోజులాగానే విద్యార్థులు అంగన్‌వాడి కేంద్రంలో మధ్యాహ్న సమయంలో లెమన్‌రైస్ ఆహారంగా పిల్లలకు తినిపించారు. కొద్దిసేపటికే 5మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైయ్యారు. అంగన్‌వాడి టీచర్లు విద్యార్థులను వెంటనే 108 సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకొన్న నాయుడుపేట సిడిపిఓ ఉమామహేశ్వరి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోన్నారు. విద్యార్థులకు మైరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## ఘనంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు



గూడూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఓం సాయిరాం వృద్ధాశ్రమంలో నిరాశ్రయులకు అన్న దానం ఘనంగా నిర్వహించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదినాన్ని పురస్కరించుకొని గూడూరు 1వ పట్టణంలోనే ఓం సాయిరాం వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధాశ్రమంలో ఉన్న నిరాశ్రయులకు అన్నదానం చేశారు. గూడూరు ఫ్యాన్స్ అసోసియే షన్ చిట్టమూరు శ్రీనివాసులు మాట్లాడుతూ అల్లు అర్జున్ సహకారంతో మరియు స్ఫూర్తితో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకీ, బన్నీ, సిద్దు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## అవిశ్వాసం తెలుగుదేశం పార్టీకి సంబంధం లేదు : ఎమ్మెల్యే



వెంకటగిరి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : చైర్ పర్సన్ నక్కా భానుప్రియను అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుండి తొలగించే ప్రయత్నాలు తెలుగుదేశం పార్టీ చేయలేదని పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే కురుగొండ రామకృష్ణ తెలిపారు. వైసిపి నియోజకవర్గ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీకి రుద్దడం మంచిది కాదన్నారు. అవిశ్వాస తీర్మానానికి తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. చైర్‌పర్సన్ వైసిపి పార్టీకి చెందిన వారైనా రామ్‌కుమార్‌రెడ్డి వెంట నడవలేదని అక్కస్సుతో ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శించారు. నేదురుమల్లి కుటుంబం కనుమరుగై పోతుందని దీంతో ఆయన ఉలికి చాటుకునేందుకు అవిశ్వాస తీర్మానం పెట్టిస్తున్నట్లు తెలిపారు. చైర్‌పర్సన్ కూడా ఆయనకు అనుకూలంగా మలుచుకు నేందుకు కౌన్సిలర్లను భయపెట్టి అవిశ్వాస తీర్మానం పెట్టే ప్రయత్నాలు చేశారని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుందని విమర్శించారు. ప్రజలు 11 సీట్లనే ఆ పార్టీకి ఇచ్చారని తెలిపారు. ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై ఇచ్చే తీర్పును తెలుగుదేశం పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి మెప్పు కోసమే రాంకుమార్‌రెడ్డి ఇలా చేస్తున్నారని తెలిపారు.

## మండల బిజెపి నూతన అధ్యక్షుడిగా సురేష్



కోట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : మండల భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా పులి సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం కోటలో మండల బిజెపి కమిటీ సమావేశం జరిగింది. ఎన్నికల అధికారిగా డాక్టర్ శ్రీహరి వ్యవహరించారు. పార్టీలోని నాయకులంతా ఏకగ్రీవంగా యువకుడు, ఉత్సాహ వంతుడు పులి సురేష్‌ను ఏకగ్రీవంగా మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి అధ్యక్షుడు పులి సురేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ మరో పక్క పార్టీని కోట మండలంలో బలోపేతం చేస్తామన్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, జిల్లా కోర్ కమిటీ సభ్యులు దువ్వూరు గిరిధర్‌రెడ్డి, ఎస్ రమేష్‌బాబు, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు బీరువా వితరణ



తడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: తడ మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని సుందరపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌలభ్యం కోసం మంగళవారం దాతలు బీరువాను విరాళంగా అందించారు. అదే గ్రామానికి చెందిన మహరాల చెంగయ్య, మాతమ్మ వారి కుమారుడు సుబ్బహ్మణ్యంల జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు రత్నయ్య, దామోదర్, కోదండపాణిలు ఈ సాయం అందజేశారు. పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ లక్ష్మయ్య, పూర్వపు ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, సిఆర్‌పి మునుస్వామి, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి అదృశ్యం



గూడూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఎగువ వీరారెడ్డిపల్లి మసీదు దగ్గర షేక్ జుహీ మూడో తరగతి చదువుతున్న చిన్నారి మంగళవారం ఉదయం నుంచి కనబడుటలేదు. ఈ పాప ఆచూకీ తెలిసినవారు రెండవ పట్టణ పోలీసువారికి తెలియజేయాలని రెండవ పట్టణ ఎస్ఐ తెలిపారు. ఈ పాప తల్లిదండ్రులు ఫోన్ నెంబర్ 9703176602 సంప్రదించాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



విజయపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి సుబ్రహ్మణ్యం (32)కి రక్త గాయాలైన సంఘటన మండలంలోని మహారాజపురం-కేశవపురం మార్గ మధ్యమంలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా... జంబాడ ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం ద్విచక్రవాహనంలో కనకమ్మ సత్రంకు వెళుతుండగా ఎదురుగా లారీ రావడంతో పక్కకు తప్పుకోవడానికి ప్రయత్నం చేయగా రోడ్డు పక్కనే మట్టి తవ్వడంతో దానిపై పడి రక్త గాయాలయ్యాయి. 108కు సమాచారం అందించడంతో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించి పరిస్థితి విషమించిందని వైద్యులు తిరుపతి స్విమ్స్‌కు తరలించారు.

## ఉపాధి హామీలో అవకతవకలపై విచారణ

తడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకాలు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ పనుల్లో జరిగిన అవకతవకలపై అధికారులు సమీక్షించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో మంగళ వారం జరిగిన ప్రజా వేదికలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇటీవల కొన్ని గ్రామాల్లో జరిగిన పనులపై ఫిర్యాదులు అందడంతో అధికారులు వాటిమీద సమీక్షించారు. పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవి కాలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని, అవసరమైన మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటివి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎన్.విజయకుమార్, పలువురు ఎపిఓలు, ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనుల నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పోషకాహారంపై ప్రజల్లో అవగాహన

కోట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : పోషకాహార విలువలను తెలియజేస్తూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు స్త్రీ శిశు సంక్షేమశాఖ సన్నద్ధమైందని కోట సిడిపిఓ మునికుమారి చెప్పారు. మంగళ వారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు పోషణ అభియాన్ (పోషణ పక్షోత్సవాలు) కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు అందాయన్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పూర్తిస్థాయిలో పోషకాహారం అందేలా చర్యలు తీసుకుంటామ న్నారు. ఈ నెల 8నుంచి 22వ తేదీ వరకు ప్రాజెక్టు పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యత, కౌమార దశలో బాలికలు, ఆరేళ్లలోపు పిల్లల్లో రక్తహీనతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## రైస్ స్టాక్‌ను పరిశీలించిన జిల్లా మేనేజర్

వాకాడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడలో ఉన్న రైస్ గోడౌన్‌లను మంగళవారం పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ సుమతి పరిశీలించారు. గోడౌన్‌లోని నిల్వ ఉన్న బియ్యం, చక్కెర, కందిపప్పుతో పాటు రికార్డులను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి నెల పూర్తయిన తర్వాత రికార్డులను పరిశీలించడం జరిగిందన్నారు, ప్రభుత్వం అందిస్తున్న రేషన్, కందిపప్పు చక్కెర ప్రతి నెల ఒకటో తేదీనే ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏమెంట్ మిషన్ ద్వారా రేషన్ సప్లై డీలర్లకు అందిస్తున్నామన్నారు. ఆమె వెంట వాకాడు స్టాక్ పాయింట్ ఇన్చార్జి వెంకటేశ్వర్లు, సిబ్బంది బాబు తదితరులు ఉన్నారు.

## భక్తి బావాన్ని పెంపొందించుకోండి..!

**కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి**



రామచంద్రాపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: ప్రజలు భక్తి బావాన్ని పెంపొందించుకోవాలని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి అన్నారు. మంగళవారం కొత్తకండ్రిగ సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమంలో జరుగుతున్న ఉత్సవాలలో ఆశ్రమ వ్యవస్థాపకులు కైలాస్ గురూజీతో కలిసి ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌చే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గోమాతకు, తులసి కోటకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన శ్రీరామనవమి విశిష్టతను వివరించారు. భక్తులకు ఆశీర్వాదాలందించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## హనుమంత వాహనంపై విహరించిన కోదండరాముడు



తవణంపల్లె, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: మండలంలోని అరగొండ శ్రీకోదండరామ స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీసీతా సమేతుడైన కోదండరాముడు తన కిష్టమైన హనుమంత వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. ఆలయంలో ఈనెల 6 శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈమేరకు మంగళవారం స్వామివారికి హనుమంత వాహనసేవను అత్యంత వైభకోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి అరగొండ, పైమాఘంకు చెందిన బలిజ కులస్థులు ఉభయదారులుగా వ్యవహరించి ఉదయం ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అలంకరించి ప్రత్యేకపూజలు చేసి దూప దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం రాత్రి అర్చకుల పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు హనుమంత వాహనంపై అధిరోహించి మంగళ వాయిద్యాలు, భాణా సంచా పేలుళ్ళ నడుమగ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రంలో వ్యభిచారంపై పోలీసుల కన్నెర్ర



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : పుణ్యక్షేత్రంలోని లాడ్జిల్లో విచ్చల విడిగా సాగుతున్న వ్యభిచారంపై పోలీసులు కన్నెర్ర జేసారు. తరచూ దాడులు నిర్వహిస్తూ కట్టడకి ప్రయత్నిస్తున్నారు. ఈ నేపధ్యంలో మూడు రోజులుగా వరుసగా తేరువీధిలోని లాడ్జిల్లో ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తిలోని లాడ్జిల్లో విచ్చల విడిగా వ్యభిచారం సాగుతుంది. అయితే పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరించటంతో విచ్చల విడిగా మారింది. గత మూడు రోజులుగా ప్రతి రోజూ దాడులు నిర్వహిస్తున్నారు. సందుగొందు ల్లోని లాడ్జిల్లోనే కాకుండా ప్రధాన వీధులై తేరువీధిలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి తేరువీధిలోని ఓ ప్రధాన లాడ్జిల్లో రికార్డులను సిఐ గోపి వారి సిబ్బందితో కలసి పరిశీలించారు. అంతేకాక గదుల్లోకి వెళ్ళి పరిశీలించారు. మేనేజర్‌ను విచారించారు. అలాగే ఓ లాడ్జిలో దాడి చేసినపుడు నలుగురు మహిళలు ఇద్దరు మగవారు పట్టుబడడంతో వారితో పాటు లాడ్జి నిర్వాహకులపై కూడా కేసు నమోదు చేసారు.

## శ్రీ బాలాజీ ఆసుపత్రిలో న్యూరాలజీ చికిత్సలు

రేణిగుంట ఏప్రిల్ 8 ప్రభాతవార్త: మండలం విమానాశ్రయ మార్గం లోని శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ ఆసుపత్రి నందు మంగళవారం నుండి న్యూరాలజీ సేవలు ప్రారంభమయ్యాయి. వారంలో ప్రతి మంగళవారం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ యుగవర్ధన్ రోగులకు అందుబాటులో ఉంటారు. బ్రెయిన్ స్ట్రోక్, ట్రోమెటిక్ హెడ్ ఇంజురీ, ఇంట్రో క్రానికల్ బ్లీడ్, బ్రెయిన్ ట్యూమర్స్, స్పైయిన్ ట్యూమర్స్, స్పైయిన్ ఇంజురీస్, సర్వికల్ లుంబర్ డిస్క్‌లకు చికిత్సలు చేస్తారు. డాక్టర్ యుగవర్ధన్ ఎంబిబిఎస్, ఎమ్మెస్ ఎంసిహెచ్, న్యూరో సర్జరీ, ఫెలో ఇన్ న్యూరో ఇండస్కోపీ పూర్తి చేశారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిన్నప్పన్, హెచ్‌ఆర్ డాక్టర్ నాగరాజు, జేఈవో డాక్టర్ నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆసుపత్రి నందు హై ఎండ్ సిటీ, ఎంఆర్ఐ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పేదప్రజలకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా సర్జరీలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ ఆసుపత్రి ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి అనేక వైద్య సదుపాయాలను అందుబాటులో తీసుకోరావడానికి ఛైర్మన్ పాణిగ్రాహి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

## గోవిందదామంకు కలెక్టర్‌తో కలసి భూమిపూజ

**రోడ్డు విస్తరణ, ఆర్‌టిసి డిపో, ఎంపిడిఓ భవనం**

**చంద్రగిరి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం..! ఎంఎల్‌ఏ పులివర్తి నాని**



చంద్రగిరి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: సంకల్పం సిద్ధించిన వేళ ఎంఎల్‌ఏ పులివర్తి నానికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రగిరి స్వర్ణముఖీనదీ తీరాన రైతు రామచంద్రారెడ్డి సంపూర్ణ సహకారంతో (2.10 ఎకరాలు భూమి విరాళం) మంగళవారం ఎంఎల్‌ఏ పులివర్తి నాని, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంయుక్తంగా గోవిందధామం నిర్మాణానికి భూమిపూజ చేశారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శిగా సుధీర్ఘ కాలం పనిచేసిన దివంగత గంగపల్లి భాస్కర్, తెలుగుయువత అధ్యక్షుడుగా విశిష్ట సేవలందించిన దివంగత భానుప్రకాష్ రెడ్డి (బన్నీ) భౌతికకాయాలను శ్మశాన వాటికకు తరలించిన సమయంలో అక్కడ ఎదురైన అనుభవాలతో చలించిపోయారు. దీంతో చంద్రగిరిలో గోవిందధామం నిర్మించాలని సంకల్పించుకున్నారు. నాటి నుండి నేటి వరకు సంకల్పసిద్ధి కోసం ఎంఎల్‌ఏ అలుపెరుగని కృషి చేశారు. తహశీల్దార్ శివరామసుబ్బయ్య నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో సహా రాష్ట్ర రెవెన్యూ విభాగాలలో గోవింద ధామం నిర్మాణానికి అవసరమైన అనుమతుల కొరకు విశేషంగా శ్రమించారు. ఎట్టకేలకు సంకల్ప సిద్ధికి మంగళవారం శుభముహూర్తం ఖరారయ్యింది. ఈ స దర్భంగా భూమిపూజ గావించి జిల్లా కలెక్టర్ తన జీవితంలో ఒక మంచి కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు ఎంఎల్‌ఏ అవకాశం కల్పించారని కొనియా డారు. అభివృద్ధి విషయంలో ఎంఎల్‌ఏ ప్రత్యేక చొరవను అభినందించారు. అనంతరం ఎంఎల్‌ఏ మాట్లాడుతూ తాను మొదలుపెట్టిన మొదటి కార్యక్రమం గోవిందధామం కార్యరూపం దాల్చడంతో 6 నుండి 9 నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. చంద్రగిరిలో రోడ్డు విస్తరణపై ఏదో తూతూమంత్రంగా మీటింగ్‌లు పెట్టానని అనుకోవద్దన్నారు. నా నెక్స్ట్ ప్రాజెక్ట్ రోడ్డు విస్తరణపైనే వుంటుందని తేల్చిచెప్పారు. అదేవిధంగా ఎంపిడిఓ కార్యాలయ భవన నిర్మాణం చేపట్టామనీ, ఆర్‌టిసి డిపో పనులు సైతం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ముఖ్యంగా చంద్రగిరి ప్రజల దాహర్తికి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంచెలంచెలుగా చంద్రగిరి అభివృద్ధికి తాను కట్టుబడి వున్నట్లు తెలిపారు. గోవిందధామం నిర్మాణానికి పలువురు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి తమ ఔధార్యాన్ని చాటుకుంటు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ క్రమంలో మహాప్రస్థానం కమిటీ సేవలను ఎంఎల్‌ఏ సహా కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య, సర్పంచ్‌లు ముద్దికుప్పం రూపరామమూర్తి, రేవతి ప్రకాష్, టిడిపి నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, సింగు సుధ, కొండూరు ప్రవీణ్ రాయల్, గౌస్‌భాషా, ఏజిపల్లిబాల, శానంబట్ల తులసి రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, ఆదూరి నాగరాజ, పులికంటి మోహన్ రెడ్డి, కడియాల రవితేజ యాదవ్, శుభగిరి, కుమార్ రాజారెడ్డి, వీరంగారి రమేష్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌రెడ్డి (పెదబాబు), తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించండి : ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : నియోజకవర్గం గత ఐదేళ్ళలో ప్రజల గురించి పట్టించుకోక వైకాపా పాలకులు నిర్లక్ష్యం చేసారని దాంతో నయోజక వర్గంలో ఎటు చూసిన సమస్యలు కాపురం చేస్తున్నాయని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్‌కు విన్నవించారు. ముఖ్యంగా వేసవి కాలం ప్రజలు ధాహర్తిని తీర్చుటకు నిధుల కొరత ఉందన్నారు. పలు గ్రామాల్లో బోర్లు మూల పడ్డాయని వివరించారు. రక్షిత నీటి పథకాలు అమలు జరుగుతున్నాయని అయితే వాటిలో క్లోరినేషన్‌కు కనీసం కూడా పంచాయతీల్లో నిధుల్లేక తల్లడిల్లుతున్నారని వివరించారు. ఇక శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో సుమారు రెండు కోట్లు నిధులు వెచ్చించి శ్మశాన వాటికను నిర్మించారని అక్కడకు వెళ్ళటానికి దారి లేక తిప్పలు పడుతున్నారని రెవెన్యూ మంత్రికి ఫిర్యాదు చేసారు. 14వ ఆర్థిక సంఘ నిధులన్ని వెచ్చించి గత వైకాపా నాయకుడు నిర్మింపజేసారని అయితే ఈనిర్మాణం చూస్తే వారి అవినీతి అర్థమౌతుందన్నారు. ఇక నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయని మంత్రికి వివరించారు.

**భూ కబ్జాలపై సమగ్ర విచారణ జరపాలి:**

శ్రీకాళహస్తి నియోజక వర్గంలో భూకబ్జాలపై రెవెన్యూ మంత్రి ప్రత్యక కమిటి ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపి గతంలో జరిగిన భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఏ మంత్రిని కోరారు. ముఖ్యంగా రాజీవ్‌నగర్ కాలనీలో ఎంత విచారణ జరిపినా ఎంత కుంభకోణం జరిగిందో అర్థం కావటం లేదని మంత్రికి వివరించారు. మాజీ శాసనసభ్యుడు, ఆయన అనుచరుల కుంభకోణాలు అంతుపట్టడం లేదన్నారు. ఇలాంటి కుంభకోణాలు రాష్ట్రంలో ఎక్కడా జరిగి ఉండదని ఎంఎల్ఏ వివరించారు. ఇదిలా ఉండగా జగనన్న కాలనీలో చోటు చేసుకున్న భూసేకరణలో కోట్లు రూపాయలు మాజీ ఎంఎల్ఏ వెనుకేసుకున్నారని అప్పటి రెవెన్యూ అంధికారుల నిర్ణయాలపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జన్మదిన సందర్భంగా నియోజకవర్గంలో భారీ ఎత్తున 25 కంపెనీలతో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కోరారు. ఈమేరకు మంత్రి, కలెక్టర్‌లచే పోస్టర్లను ఆవిష్కరింపజేసారు. ఈ మేరకు తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో పోస్టర్లు ఆవిష్కరింపజేసారు.

## టీడీఆర్ కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టాలి

**- జిల్లా ఇంచార్జిమంత్రి అనగానిని కలిసిన టీడీపీ నేతలు -గత వైసీపీ ప్రభుత్వం అక్రమాలపై ఫిర్యాదు**




తిరుపతి క్రీడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : తిరుపతి మున్సిపాలిటీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు తిరుపతి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. తిరుపతికి విచ్చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి ప్రజా సమస్యలపై మంగళవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు జి.నర్సింహ యాదవ్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, ఊకా విజయ్‌కుమార్, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, జె.బి.శ్రీనివాస్, శ్రీధర్ వర్మ, హేమంత్ రాయల్ తదితరులు కలిసి గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని వివరిం చారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించి నష్టపోయిన బాధితులందరికీ న్యాయం చేయాలని విన్నవిం చారు. మంత్రి బదులిస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రతీ ఒక్క బాధితుడికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## ట్రక్కు మోటార్ సైకిల్ ఢీ : వ్యక్తి మృతి



సదుం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : సదుం కల్లూరు రహదారి మార్గంలో ట్రక్కు ఒక ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. సదం ఏఎస్ఐ సత్యనారాయణ, రైటర్ మురళీలు తెలిపిన వివరాల మేరకు బంగారుపాలెం మండలం తుమ్మపాలెంకు చెందిన యోగరాజు కోళ్ల ఫారాల్లో సూపర్వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కల్లూరు నుంచి సదుము వైపుకు ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. పెద్దఉప్పర పల్లి నుంచి కొబ్బరి కాయలు లోడుతో వెళ్తున్న ట్రక్కు శివశక్తి డైరీ సమీపంలోని ప్రధాని రహదారిపై ఢీకొన్నాయి. దీంతో యోగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ వైశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

**కలెక్టరేట్ చుట్టూ ప్రభుత్వ భూములపై...**

## కబ్జారాయుళ్ళు డేగ కన్ను



తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా కలెక్టరేట్ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములపై కబ్జారాయుళ్ళ డేగ కన్ను పడింది. భవిష్యత్‌లో కలెక్టరేట్ చుట్టు పక్కల జిల్లా కోర్టు సముదాయాలు, మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు రానున్న నేపథ్యంలో ఓ పక్క భూకబ్జారాయుళ్లు, మరో ప్రక్క రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను సైతం కబ్జా చేసేందుకు వెనుకాడడం లేదని, వారి ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోందని బాధితులు, చుట్టు పక్కల స్థానిక ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిదానంగా వెలుగులోకి వచ్చిన బాధితులు, స్థానిక ప్రజలు తెలిపిన సమాచారం మేరకు వివరాల్లోకి వెళితే...తిరుపతి రూరల్ మండలం దామినేడు లెక్క దాఖలా సర్వేనెం. 41/2లో ఒక ఎకరా రెండు సెంట్ల భూమి మాది అంటూ ఒక వర్గం, కాదు మాది అంటూ మరో రియల్ ఎస్టేట్ వ్యాపారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. రెవెన్యూ లెక్కల్లో ఏడబ్ల్యూడీలో ఉన్న రూ. కోట్లలో పలికే ఈ భూమి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఏవిధంగా రిజిస్టర్ అయిందో అర్థం కావడం లేదని బాధితులు, స్థానిక ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినిపిస్తున్న ఆరోపణలు. అయితే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి మండల తహశీల్దార్, సర్వేయర్, వీఆర్వోలు ఒత్తాసు పలకడం ఏమిటని బాధితులు, స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఏవిధంగా స్పందిస్తారో వేచిచూద్దాం.

## గణపయ్య కాణిపాకం బస్సు ఎక్కడయ్యా

పూతలపట్టు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : తిరుపతి నుండి ప్రతిరోజు రాత్రి 8 గంటలకు తిరుపతి నుండి కాణిపాకం వెళ్లే బస్సు సర్వీసు పూతలపట్టు మండల కేంద్రంలోకి రాకుండానే రంగంపేట క్రాస్ జాతీయ రహదారి ప్రక్కనున్న సర్వీసు రోడ్డు ద్వారా కాణిపాకానికి బస్సు సర్వీసు ప్రతిరోజు వెళ్లడం ద్వారా పూతలపట్టు మండల కేంద్రంలోని ప్రజలు ఉద్యోగస్తులు యాత్రికులు అసౌకర్యానికి గురి కావడమే కాకుండా వరసిద్ధి వినాయకుడు దర్శన భాగ్యాన్నికి కూడా నోచుకోలేకపోతున్నారు. పూతలపట్టు ఒక మండల కేంద్రమే కాకుండా ఒక నియోజకవర్గ కేంద్ర బిందువు అలాంటి మండల కేంద్రానికి బస్సు సర్వీసు రాత్రిపూట రాకపోవడం వలన యాత్రికులు అసౌకర్యానికి గురవుతున్నారు.